క్లుప్తంగా

కేవీ పురంలో పారిశుద్ధ్య పనులు



కె.వెంకటాపురంలో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్

కోటవురట్ల : కె.వెంకటాపురంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను సేకరించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగాఇందిరభవానీ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. రోడ్లపై చెత్తను ఇష్టానుసారంగా వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని గ్రామస్తులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు, ఆరోగ్యకర వాతావరణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు.

పిచ్చి మొక్కలు తొలగించండి



నారాయుడుపాలెం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా పెరిగిన తుప్పలు

మునగపాక : మండలంలోని కాకరాపల్లి నుంచి నారాయుడుపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అనకాపల్లి, మునగపాక, పరవాడకు వెళ్లేవారు ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో తుప్పలు ఎత్తుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు, కౌలురైతు సంఘ జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల రాము, సీపీఎం నేత టెక్కలి జగ్గారావు పాల్గొన్నారు.

నేడు కొక్కిరాపల్లి పీఏసీఎస్ మహాజన సభ

యలమంచిలి : కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ శుక్రవారం కొక్కిరాపల్లి బ్యాంక్ ఆవరణలో నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గత సమావేశ తీర్మానాలను అమోదించడం, రైతులకు రుణమాఫీ సక్రమంగా వర్తించక పేరుకుపోయిన బకాయిలు, వన్‌టైం సెటిల్‌మెంట్, సంఘం ఆర్థిక పరిస్థితిపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాల్సిందిగా కోరారు.

దిమిలిలో శాస్త్రవేత్తల పర్యటన నేడు

రాంబిల్లి : దిమిలి గ్రామంలో శుక్రవారం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పర్యటించనున్నట్లు వీఏఏ మేఘన గురువారం తెలిపారు. రబీ వరి పైరును పరిశీలించి పొలంబడి కార్యక్రమంలో భాగంగా వీఏఏలు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

అంతా రామమయం.. ప్రతి ఊరూ అయోధ్యా నిలయమే. రాముడంటే కేవలం దేవుడు మాత్రమే కాదు. అందుకు భారతీయుల మనసులు అంగీకరించవు. మర్యాదా పురుషోత్తముడు మన జీవన విధానం. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ఊరూరా సీతారాములు కల్యాణ దంపతులుగా కొలువయ్యారు. ప్రతి ఆలయం, పందిరిలోనూ శ్రీరామ చరితం.. శ్రవణానందభరితంగా సాగింది. రామకథ పండితుల్లో తమ జీవన విధానంపై పునరాలోచన రేకెత్తిస్తే.. పామరుల్లో 'మా రాముని కష్టం లోకంలో ఎవరూ పడలేదయ్యా..!'అంటూ ఆశ్చర్యం, ఆవేదనతో కూడిన కన్నీళ్లు పెట్టించింది.



దేవవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

- అత్యంత వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- ఊరూవాడా సీతారాముల కల్యాణోత్సవాలు
- సీతారామ నామ స్మరణతో మార్మోగిన గ్రామాలు

మునగపాక : రామనామ స్మరణం.. సర్వపాప హరణం. శ్రీరామ నవమి వేడుకలు గ్రామాల్లోని రామాలయాల్లో కన్నులపండువగా జరిగాయి. తొలి వేకువ నుంచే భక్తులు స్వామి దర్శనానికి ఆలయాల ముందు బారులు తీరారు. ఖండ భజనలు, కోలాటాలు, రామనామ సంకీర్తనలతో గ్రామాలు హోరెత్తాయి. మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభంగా నిర్వహించారు.

- మునగపాక మండలంలో పేరొందిన అరబుపాలెం సీతారాముల వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నవమి వేడుకలు నిర్వహించారు. భద్రాద్రి సీతారాముల కల్యాణం మాదిరి ఇక్కడ కూడా వేడుకలు జరిగాయి. ఈ కల్యాణ వేడుకల్ని తిలకించేందుకు పరిసర గ్రామాలతోపాటు, ఇదే గ్రామంలో జన్మించి ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా కుటుంబాలతో సహా వచ్చి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకట సతీష్ ఏర్పాట్లు చేశారు. మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తదితరులు కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.
- మునగపాకలోని పురాతన రామాలయం, మంద బయిల రామాలయం, సంతబయిల, దళితవాడలోని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
- వాడ్రాపల్లి, నాగవరం, సిరసపల్లి, చూచుకొండ, గణపర్తి, మెలిపాక, ఉమ్మలాడ, నాగులాపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

కోటవురట్ల : శ్రీరామ నవమి వేడుకలతో పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చలువ పందిళ్లలో పానకం పంపిణీ చేశారు. కైలాసపట్నంలోని రామాలయంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పూజలు చేశారు. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, ఎంపీటీసీ శానాపతి రమణ, డీవీ యువసేన అధ్యక్షుడు చామంతుల శ్రీనివాసు పాల్గొన్నారు.

నక్కపల్లి : శ్రీరామనవమి వేడుకలు గురువారం వాడ వాడలా ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం రామాలయాలకు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. మండలంలో దేవవరం, వేంపాడు, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, చినరామభద్రపురం, ఒడ్డిమెట్ట, వెదుళ్లపాలెం, అమలాపురం, గొడిచర్ల, నక్కపల్లి, కాగిత, రాజయ్యపేట, సీహెచ్ఎల్ పురం, రేబాక, ఉపమాక తదితర గ్రామాల్లో సీతారాముల చిత్రపటాలను, ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

- దేవవరంలో సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, నర్సింహమూర్తి దంపతులచే సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వందలాది భక్తులు తరలివచ్చారు. కల్యాణ ఘట్టం ముగిసే వరకు వేచి ఉండి, వడపప్పు బెల్లం పానకాన్ని ప్రసాదంగా స్వీకరించి వెళ్లారు.
- వేంపాడు, దేవవరం, చందనాడ గ్రామాల్లో చిన్నారులు, మహిళలు కోలాటం నిర్వహించారు. రాత్రి ఆలయాల్లో ప్రత్యేక భజన కార్యక్రమాలు జరిగాయి. కల్యాణమహోత్సవాల్లో కాపుకార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు గొర్ల నర్సింహమూర్తి, దండు బలరామరాజు, ఉపమాక దేవస్థాన మాజీ చైర్మన్ పెంకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



అరబుపాలెంలో సీతారాముల సన్నిధిలో మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి, బొడ్డేడ ప్రసాద్



మునగపాక సంతబయిలలో సీతారామ కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



వేంపాడులో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : సీతారాముల కల్యాణ మహోత్సవాలు అచ్యుతాపురం మండలంలో గురువారం కమనీయంగా సాగాయి. మండలంలోని కొండకర్ల, హరిపాలెం, జగ్గన్నపేట, ఎర్రవరం, మల్లవరం, జగన్నాథపురం, అచ్యుతాపురం, రామన్నపాలెం, ఇరువాడ, దుప్పుతూరు, మార్టూరు, పూడిమడక, దోసూరు, మడుతూరు తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భారీగా అన్నసమారాధనలు నిర్వహించారు.

ఎస్.రాయవరం : మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గుడివాడి శివారు కొత్తపోలవరం, మేజర్‌గ్రామ పంచాయితీ తిమ్మాపురం, సైతారుపేట, ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, కర్రివానిపాలెం, రేవుపోలవరం, పెదగుమ్ములూరు, దార్లపూడి తదితర గ్రామాల్లో వేకువ జామునుంచే భక్తులు రామాలయాలకు చేరుకుని సీతారాములను దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సైతారుపేటలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

పాయకరావుపేట : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని రామాలయాలు రామనామ స్మరణతో మార్మోగాయి. పాయకరావుపేట, మంగవరం, పాల్తేరు, పి.ఎల్.పురం, సత్యవరం, కేశవరం, నామవరం తదితర గ్రామాల్లో రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- పాయకరావుపేట పట్టణంలోని శ్రీసీతారామ ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. - పాల్తేరు గ్రామంలోని రామాలయానికి అదే గ్రామానికి చెందిన దేవవరపు రాంబాబు 60 సెంట్ల భూమిని విరాళంగా ఇస్తూ, సంబంధిత పత్రాలను తపోవనం స్వామీజీ సచ్చిదానంద చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందించారు.
- పలు గ్రామాల రామాలయాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. కల్యాణోత్సవ అనంతరం తలంబ్రాలు, తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

యలమంచిలి : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలోని రామాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో కొత్తపేట, యాతపేట, పాతవీధి, దిమిలి రోడ్డు రామాలయం, పెదపల్లి గ్రామ రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం కొత్తపేట రామాలయం, పెదపల్లి రామాలయాల్లో రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాంబిల్లిలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) తన సొంత నిధులతో నిర్మించిన రామాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ) దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

- దిమిలి గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రామాలయం కమిటీ సభ్యుడు కన్నం బాలాజీ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల సారె ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైస్ ఎంపీపీ కొటాపు లక్ష్మీవడ్డికాసులు, సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అరబుపాలెం రామాలయంలో మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న పండితులు



కోటవురట్లలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా అన్నసమారాధన



కొత్తపేట రామాలయ కల్యాణోత్సవ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు



కొండకర్ల రామాలయంలో ఘనంగా సీతారాముల కల్యాణం



రాంబిల్లిలో సీతారాముల కల్యాణంలో సుకుమారవర్మ దంపతులు



పాయకరావుపేటలో ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



కైలాసపట్నంలో సీతారాములను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ఎన్ రాజు

రేవుపోలవరం వైద్యశిబిరంపై అసంతృప్తి

కలెక్టర్ ఆదేశించినా.. ఫలితం శూన్యమని ఆగ్రహం

ఎస్.రాయవరం : రేవుపోలవరంలో పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన దక్కినా.. వైద్య సిబ్బంది తీరు మాత్రం రోగులకు కోపాన్ని తెప్పించింది. గ్రామానికి చెందిన యువకుడు గనగళ్ల రాంబాబు రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు గతవారం ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహణకు కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు వైద్య శిబిరం ప్రారంభమైనా వైద్యులు మాత్రం చాలా సమయం వరకు రాలేదు. వైద్యుల రాకపై రోగులు ప్రశ్నిస్తే.. ఇదిగో వస్తారు.. అదిగో వచ్చేస్తున్నారని నచ్చజెప్పు.. సుగర్, బీపీ చెక్ చేశారు. ఆ తర్వాత తీరిగ్గా వచ్చిన వైద్యాధికారి రాజేశ్వరి కొందరు రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు.

ఈ వైద్య శిబిరానికి సుమారు 220 మంది రోగులు హాజరై, సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అయితే గ్రామస్తులు కోరుకున్న కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేలా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించాల్సిందిగా వారు కోరుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు యూనిఫాం వితరణ



యూనిఫాంలు అందుకుంటున్న గ్రీన్ అంబాసిడర్లు

ఎస్.రాయవరం : గ్రీన్ అంబాసిడర్లు మరింత బాధ్యతగా పనిచేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు అన్నారు. గ్రామంలో దుబాసి తాతయ్యలు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు గురువారం గ్రీన్ అంబాసిడర్స్‌కు యూనిఫాం అందించారు. కార్యక్రమంలోఎస్సార్ సీపీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, లక్కోజు ఆదిమూర్తి, కుర్రా కాశి, దుబాసి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం గింజలపై రామనామం





శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నాగులాపల్లి సీతారాముల ఆలయంలో కర్రి యశోద దంపతులు బియ్యం గింజలపై శ్రీరామ నామం రాశారు. వేలాది బియ్యం గింజలపై శ్రీరామ నామం రాసి, వాటిని తలంబ్రాలుగా సీతారామ కల్యాణంలో వినియోగించాల్సిందిగా ఆలయానికి సమర్పించారు.

– మునగపాక

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ, దిబ్బపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఈ నెల 31న మరమ్మతు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్(ఈఈ) రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మండల ప్రభుత్వ కార్యాలయాల పరిధి, వెదురువాడ, మార్టూరు, దిబ్బపాలెం, దుప్పుతూరు, కోనంపాలెం, కుమారపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

యలమంచిలి : విద్యుత్ మరమ్మతుల కారణంగా యలమంచిలి పట్టణంలో పలు చోట్ల శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సంబంధిత అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొత్తపేట, స్టేషన్ రోడ్డు, పరమేశ్వరీ థియేటర్ ఏరియా, భవనంవీధి, నాగేంద్ర కాలనీ, కోర్టుపేట, గాంధీనగర్, నెహ్రూనగర్, ద్వారకానగర్, రామ్మూర్తి నగర్, శేషుగెడ్డ ఏరియాలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

గౌరీ పీఏసీఎస్ బడ్జెట్ సమావేశం నేడు

అనకాపల్లిటౌన్ : గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ గవరపాలెం వి.వి.రమణ సహకార భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్నట్లు సంఘం చైర్మన్ కాండ్రేగుల కృష్ణఅప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ 2022–23 పరిపాలన నివేదిక వివరాలు, 2023–24 బడ్జెట్ అంచనాలపై చర్చ జరుగుతుందన్నారు. సంఘ సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

వెంకన్న సన్నిధిలో సీతారాముల కల్యాణం



ఉపమాకలో సీతారాముల కల్యాణ వేడుక

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యాభిషేకాలు, అర్చనలు పూర్తిచేశారు. తర్వాత కొండమెట్ల వద్ద గల సీతారామస్వామివారి ఆలయంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకుముందు వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుందరాకాండ పారాయణం జరిగింది. అనంతరం ప్రసాద వినియోగం తీర్థగోష్టి నిర్వహించారు.

మళ్లను పరామర్శించిన మంత్రి గుడివాడ



సత్యనారాయణతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : అనారోగ్యానికి గురైన సీపీఎం నాయకుడు మళ్ల సత్యనారాయణను ఆయన స్వగృహంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరామర్శించారు. మంత్రి వెంట ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు భోగలింగేశ్వరరావు, బొడ్డేడ శివకృష్ణ, మళ్ల స్వామి, గొన్నాబత్తుల వెంకటరమణ, గైపూరి రాజు, మునూరు శ్రీనివాస్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్ : స్వర్గీయ మళ్ల భువనేశ్వరావు జయంతిని పురస్కరించుకుని విశాఖ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వైద్య సిబ్బందిచే స్థానిక కాశీబాబా ఆలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ నరసింగరావు

అనకాపల్లిటౌన్ : త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్‌ను రూరల్ ఎస్ఐ నరసింగరావు, అగ్నిమాపక అధికారి లక్ష్మయ్యలు గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లిటౌన్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న అమరపల్లి నూక అప్పారావును అదుపులోకి తీసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఈ మేరకు అప్పారావు నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.